# హక్కు

## కొమ్మూరి రవికిరణ్

**డప్పులతో హోరెత్తిపోయింది ఆ ప్రాంతం:**

**ఉలిక్కిపడి ఎక్కడి పనులు అక్కడ ఆపేసి గబగబా యిళ్ళల్లోంచి బయటకు వచ్చారు ఆ వీధిలోని జనం.**

**కొంచెం దూరంలో దాదాపు వందమంది జనం ఊరేగింపుగా వస్తున్నారు. టపాకాయలు పేలుతున్నాయి. రంగులు గాలిలో కలిసిపోతున్నాయి. కొంతమంది త్రాగేసి డప్పులకి లయబద్ధంగా విజిల్స్ వేస్తూ పూనకం వచ్చినట్టుగా డాన్సులు చేస్తున్నారు.**

**ఒక్కసారిగా కోలాహలంగా మారిపోయింది అక్కడి వాతావరణం. అర్థంకాక అయోమయంగా తిలకిస్తున్న అక్కడి ప్రజల సందేహాన్ని నివృత్తి చెయ్యడంకోసం, ఊరేగింపుగా వస్తున్న జనంలోంచి వున్నట్టుండి ఒక మనిషిని భుజాలమీద అమాంతంగా పైకి లేపారు.**

అందరూ తలలు పైకెత్తి ఆ మనిషిని చూశారు. పైకి ఎత్తబడ్డ వ్యక్తి తనవైపే చూస్తున్న వాళ్ళకి దణ్ణం పెడుతూ, నవ్వుతూ చేతులు వూపుతున్నాడు.

అదే వీధి మొదట్లో బడ్డికొట్లో వున్న ముసలమ్మ, తన ముందునుంచి వెళ్తున్న గుంపులోని వెనకాల వ్యక్తిని ఆపి "ఏరా.. రాముడు? ఏమైంది మన సింహాద్రిగాడికి? మోసుకువెళ్తున్నారు పాపం వాడ్ని" అడిగింది.

రాముడు పెద్దగా నవ్వాడు "మోసుకు రావడం ఏందే అవ్వ?... బ్రహ్మరథం. మన సింహాద్రి గాడికి వచ్చే ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చెయ్యడానికి టికెట్టిచ్చారు." అన్నాడు.

"ఆ.... " బుగ్గ నొక్కుకుంది అవ్వ.

ఒక్క అవ్వకే కాదు, ఆ ప్రాంతంలోనే కాదు, ఆ వూరి ప్రజలకు ఒక జులాయిగా, త్రాగుబోతుగా, రౌడీగా సింహాద్రి సుపరిచితుడే. అలాంటివాడికి టికెట్టా?

"ఒరే... ఆగాగు. ఇంతకీ ఏ పార్టీ యిచ్చింది వాడికి టికెట్టు?"

"మన రూలింగ్ పార్టీ తరుపునే వాడు పోటీ చేసేది. ఇక మన వార్డు బాగుపడినట్టే..." అని పరుగులాంటి నడకతో గుంపులో కలిసిపోయాడు రాముడు.

వెళ్ళిపోతున్న ఊరేగింపుని చూస్తూ నిట్టూర్చి "ఆ..... బాగుపడినట్టే?' కసిగా అనుకుంది.

వీధి చివర వుండే తన యింటి ముందుకు రాగానే ఆపమన్నట్టు చేతులు పైకెత్తాడు సింహాద్రి. డప్పులు ఆగిపోయాయి.

సింహాద్రి క్రిందకి దిగి మెడలో వున్న దండల తోనే తలుపులు త్రోసి లోపలకి వెళ్ళాడు.

లోపల చిరిగిపోయిన చాపమీద కూర్చుని గోడకి ఆనుకుని వుంది సింహాద్రి భార్య దుర్గ. ప్రక్కనే ఆమె ఆరేళ్ళ కొడుకు పడుకుని వున్నాడు.

దండలు తీసి ముఖం మీద పడ్డ రంగుల్ని తుడుచుకుంటూ గర్వంగా అన్నాడు "నీ మొగుడు కాబోయే కౌన్సిలరే... సంబరాలు వినబడట్లేదా? బయటకు రాకుండా ఏం చేస్తున్నావ్?"

ఏం మాట్లాడలేదు దుర్గ. అతని వైపు ఒకసారి తలతిప్పి, మళ్ళీ ఎప్పటిలానే గాజు కళ్ళతో శూన్యంలోకి చూస్తూ వుండిపోయింది. ఆమె చెయ్యి నిద్రపోతున్న కొడుకు తల నిమురుతూ వుంది.

***

"నువ్వేన్నయినా చెప్పు. నువ్వు చేసింది నాకు నచ్చలేదయ్యా" అలుగుతున్నట్లుగా అన్నాడు సాంబుడు.

"ఏం చేశాన్రా?" ఉయ్యాల బల్ల మీద వూగుతూ అడిగాడు మాధవరావు. అతను ఆ వూరి ఎమ్మెల్యే.

సాంబుడు మాధవరావుకి నమ్మినబంటు. అందరి ముందు వినయంగా వుంటూ, ఎవరూ లేనప్పుడు మాధవరావుని "నువ్వు" అనేంత చనువుంది సాంబుడికి.

ఉదయమే లేచి బయట వున్న పెద్ద వరండాలో ఉయ్యాలబల్ల మీద కూర్చుని సాంబుడిచ్చిన కాఫీ త్రాగుతూ, కబుర్లు చెప్పడం అతనికలవాటు.

ఇంకా కార్యకర్తలు ఎవరూ రాలేదు.

"చెప్పరా?.... ఏం చేశాను?"

"నిన్నే నమ్ముకుని... నీకే కాదు పార్టీకి కూడా ఎంతో చేసినవాళ్ళున్నారు. నీ మీద ఆశ పెట్టుకున్నారు. వాళ్ళని వదిలేసి ఆ వెధవ సింహాద్రిగాడికి రికమండ్ చేసి మరీ టిక్కెట్టు యిప్పించావు. గతంలో ఎంతమంది వున్నారు అదే వార్డులో బాగా పనిచేసినవాళ్ళు? నాకే కాదు, మన వాళ్ళల్లో చాలా మందికి నచ్చలేదయ్యా నువ్వు చేసింది." రవ్వంత కోపంతో అన్నాడు సాంబుడు.

"అదా....." తేలిగ్గా అన్నాడు మాధవరావు.

"ఆ సింహాద్రి ఎంత పోరంబోకో వూరందరికీ తెలుసు. ఎన్నో కేసులున్నాయి వాడిమీద. వాడి మీద రౌటీ షీట్ తీయించేశావ్. త్రాగితే గాని సరిగ్గా నిలబడలేని అర్భకుడితో నామినేషన్ వేయించావ్.

వీడ్ని చూసి ఎవరు ఓటేస్తారయ్యా?'' కచ్చగా అన్నాడు సాంబుడు.

అతను చెప్పింది విని ''పార్టీ కోసం, నాకోసం చేసినవాళ్ళున్నారు. కాని, సింహాద్రిలా ఎవరూ పని చెయ్యలేదురా.''

''ఏమంటున్నారయ్యా మీరు?'' అర్థంకాక అడిగాడు.

''నేనూ చేశాన్రా పార్టీకోసం, మన వాళ్ళకోసం. కాని ఏం జరిగింది? మొన్న అసెంబ్లీ ఎన్నికలప్పుడు... ఒక దశలో నాకు సీటు రాకుండా చేద్దామని ఆ పేర్రాజు ఎలా అడ్డు పడ్డాడో తెలుసుగా? ఇప్పుడు చెప్పిన 'మనవాళ్ళు' పేర్రాజుని బలపరిచారు. అటు వైపు తిరిగిపోయారు. నేనవన్నీ మర్చిపోలేదురా అందర్నీ గుర్తుపెట్టుకున్నాను.'' అని ఆగాడు.

సాంబుడు మాధవరావు కేసే చూస్తున్నాడు.

''అప్పుడు వీడే... యీ సింహాద్రిగాడే నా కోసం జనాన్ని తెచ్చాడు. నిరాహార దీక్ష చేశాడు. చివరకు ఒళ్ళుకాల్చుకుని ప్రాణాలు తీసుకోబోయాడు. అప్పుడే కదరా అధిష్ఠానం దిగి వచ్చింది. భయమంటే తెలియని మొండోడు, మూర్ఖుడు వాడు. అలాంటి విశ్వాసంగల జంతువు మనకి ఎప్పుడూ వుండాలి. అందుకే వాడ్ని నిలబెట్టాను. ఇక మనల్ని దాటి ఎక్కడికీ పోడు.''

సాంబుడు తలూపి ''అర్థమయ్యిందయ్యా....'' అన్నాడు.

''రాజకీయంలో మనుషుల్ని అమ్ముకోవడం, కొనుక్కోవడం గాని, నమ్ముకోకూడదు ఎవర్నీ. కాని, నేను సింహాద్రిని నమ్ముతాను. ఎందుకంటే వాడు మనిషి కాదు కాబట్టి.''

''నువ్వు చెప్పింది బాగానే వుందయ్యా. అసలు వాడు గెలుస్తాడా? వాడిమీద కసితో చాలా మంది వున్నారు. పోటీ బాగా వుంది.''

''వాడ్ని చూసి ఎవరేస్తార్రా. పార్టీ గుర్తుని చూసి వేస్తారు.''

గేటు దగ్గర చప్పుడయ్యింది. సాంబుడు చూశాడు. సింహాద్రి వస్తున్నాడు. వెనకాల పదిమందిదాకా వున్నారు. సింహాద్రి రావడంతోనే వంగి మాధవరావు కాళ్ళకి దణ్ణం పెట్టాడు.

మాధవరావు నవ్వుతూ సాంబుడ్ని చూసి ''లేరా.. లే..'' అన్నాడు సింహాద్రితో.

సింహాద్రి లేచి చేతులు కట్టుకుని నిలబడ్డాడు వినయంగా.

''ఏరా? ప్రొద్దుటే వచ్చావ్?''

బుర్రగోక్కుంటూ అన్నాడు సింహాద్రి ''సారు..... యివ్వాల్టినుంచి ప్రచారం ముమ్మరం చెయ్యాలి.''

''అవును.. యీ నాలుగు రోజులూ తాగుడు మానేయ్. బుద్ధిగా వుండు. నీమీద కేసులన్నీ కొట్టిం చెయ్యడానికి, నీకు టికెట్టు యిప్పించడానికి ఎంత కష్టపడ్డానో తెలుసుగా? నీ కోసమేరా యిదంతా.''

ఇప్పటిదాకా తన కోసం సింహాద్రి ఎన్ని త్యాగాలు చేశాడో చెప్పి యిప్పుడు వాడిముందు తనెంతో కష్టపడినట్టు చెబుతున్న మాధవరావుని ఆశ్చర్యంగా చూస్తున్నాడు సాంబుడు.



''అందుకేనయ్యా వచ్చాను'' చేతులు నలుపుకుంటూ అన్నాడు సింహాద్రి.

''ఏరా... డబ్బేమయినా కావాలా?''

అడ్డంగా తలూపి ''నాకు భయంగా వుంది సారు. గెలుస్తానో లేదోనని.''

ఆ మాటకి పెద్దగా నవ్వారు మాధవరావు, సాంబుడు.

వింతగా చూశాడు వాళ్ళని సింహాద్రి.

సాంబుడన్నాడు ''అయ్య యిప్పుడే అంటున్నాడు నీకసలు భయమంటే తెలీదని మరి నువ్వేంట్రా....?''

''అది కాద్సార్. నేను ప్రచారానికి వెళ్తుంటే వీధుల్లో జనం యిళ్ళల్లోకి వెళ్ళిపోతున్నారయ్యా. ఆడవాళ్ళయితే తలుపులు తెరవడానికి దడిచిపోతున్నారు.'' సిగ్గు పడుతున్నట్టు అన్నాడు సింహాద్రి.

మాధవరావు ఆలోచించి చెప్పాడు ''మీ ఆవిడ్ని నీతోపాటు తీసుకెళ్ళబోయావా? యింతకీ ఏం చదువుకుందిరా మీ ఆవిడ?''

''పదవతరగతి. అసలు బయటకురాదు. ఎవరితో మాట్లాడదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ వుంటుంది. నాతో కూడా మాట్లాడదు సారు.''

మాధవరావు, సాంబడు ముఖాలు చూసుకున్నారు.

''అందుకే యివ్వాళ ప్రచారానికి మీరు కూడా వస్తే బావుంటుందయ్యా....'' నసుగుతున్నట్టు అన్నాడు సింహాద్రి.

''నేనప్పుడే ఎందుకురా? చివరిరోజు వస్తానన్నానుగా?''

''మీరుంటే నాకు ధైర్యంగా వుంటుందయ్యా.''

ఏమంటావ్? అన్నట్టు సాంబుడ్ని చూశాడు మాధవరావు.

అంగీకారంగా చూశాడు సాంబుడు.

''వస్తాలేరా...'' అన్నాడు మాధవరావు.

''ఇక నేను గెలిచినట్టే సారు.'' అన్నాడు సింహాద్రి ఆనందంగా.

***

సింహాద్రి పోటీ చేస్తున్న వార్డు దగ్గరకు వచ్చిన తర్వాత కారు ఆపమని అందులోంచి దిగాడు మాధవరావు. వెనకాలే వస్తున్న అతని మనుష్యులు కూడా కార్లోంచి దిగారు.

తనకోసం ప్రచారానికి ఎమ్మెల్యే రావడంతో కొండంత ధైర్యం వచ్చింది సింహాద్రికి.

''చెప్పరా..... ముందు ఎక్కడ్నుంచి మొదలెడదాం? అడిగాడు మాధవరావు.

''మీ యిష్టం సారు.''

సింహాద్రి వీపు మీద ఒక్కటి చరిచి ''ముందు మీ యింటికెళ్దాం.'' అన్నాడు.

''ఎందుకు సారు? ఎంత మాట్లాడకపోయినా, దాని ఓటు నాకు కాక ఎవరికేస్తుంది?''

నవ్వాడు మాధవరావు ''మీ వార్డులోని జనానికి నువ్వంటే భయం పోవాలంటే మీ ఆవిడవల్లే అవుతుందిరా.'' అని ముందుకు కదిలాడు. వెనకాలే అతని బలగం కూడా.





అయిష్టంగా ముఖం పెట్టి ఎమ్మెల్యేతో పాటు నడిచాడు సింహాద్రి.

తనని చూడ్డానికి యిళ్ళలోంచి బయటకు వచ్చిన వాళ్ళని చిరునవ్వుతో పలకరిస్తూ, దణ్ణాలు పెడుతూ ముందుకు కదుల్తూ, సింహాద్రి యింటి దగ్గరకు రాగానే ఆగాడు.

సింహాద్రి వెళ్ళి తన యింటి తలుపు తట్టాడు.

రెండు నిమిషాలకి తలుపు తెరుచుకుంది. సింహాద్రి భార్య దుర్గ బయటకు వచ్చింది. ఛాతీ, వీపు అతుక్కుపోయినట్టుగా సన్నగా, రివటలా వున్న తన భార్యతో ''మన ఎమ్మెల్యే గారే'' అన్నాడు సింహాద్రి.

చేతులు జోడించింది దుర్గ.

మాధవరావు కూడా నమస్కరిస్తూ ''సింహాద్రిని మనమే దగ్గరుండి గెలిపించాలమ్మా... ఈ వార్డులోని ఆడవాళ్ళ ఓట్లు మనకే పడాలి. అసలు నీకు ఓటుందా?'' అనుమానంగా అడిగాడు మాధవరావు.

మాట్లాడింది దుర్గ సన్నగా ''ఉంది సార్. కాని, యింతవరకు వెయ్యలేదు.''

''తప్పమ్మా.. ఓటు హక్కుని ప్రతివాళ్ళు వుపయోగించుకోవాలి. అవతల పోటీ కొంచెం గట్టిగా వుంది. ఒక్క ఓటు తేడాతోనైనా గెలవచ్చు. ఆ ఓటు నీదే కావచ్చు.''

అలాగా అన్నట్టు చూసింది దుర్గ.

''నీ మొగుడు కౌన్సిలర్ అయితే ఎంత గొప్ప? ఈ పేటలో నీకెంతో పేరు. అందరూ నీకు గౌరవం యిస్తారమ్మా. అసలు మీ జీవితమే మారిపోతుంది.''

ఆలోచిస్తోంది దుర్గ

కొంచెం సేపు దుర్గతో మాట్లాడి వెళ్ళడానికి ఉద్యుక్తుడవుతూ అన్నాడు మాధవరావు. ''నీకు తోడుగా పదిమంది ఆడవాళ్ళని పంపిస్తాను.'' అని వెనక్కి తిరిగి ''అమ్మాయికి ఏం కావాలో ఏర్పాట్లు చూడండి.'' అని పురమాయించి కదలబోయాడు.

''ఒక్క మాట సార్'' అని పిలిచింది దుర్గ.

ఆగి ''చెప్పమ్మా?'' అన్నాడు.

''ఓటు.... ఓటు హక్కు గురించి చెప్పారు. మిమ్మల్ని అడిగే హక్కుని కూడా వినియోగించుకోమంటారా సార్?'' సూటిగా అడిగింది దుర్గ.

మొదట దుర్గ అడిగిన ప్రశ్న అక్కడ వాళ్ళకి అర్ధంకాలేదు. తర్వాత నివ్వెర బోయారు.

ఎన్నడూ నోరు విప్పని దుర్గ అంత ధైర్యంగా అందులో ఒక ఎమ్మెల్యేని పట్టుకుని అడగగలదని వూహించలేదు చుట్టుప్రక్కలవాళ్ళు.

సింహాద్రికి కోపం వచ్చింది ''ఏమిటే... నువ్వు అయ్యగారిని అడిగేది?'' అరుస్తూ ఆమె మీదకు వెళ్ళబోయాడు.

దుర్గ నిశ్చలంగా అలాగే నిలబడింది.

మాధవరావు అతన్ని ఆపి ''ఒరేయ్... ఆగు.'' అని అరిచాడు. సింహాద్రి ఆగిపోయాడుగాని, రొప్పుతూ దుర్గని కొరకొరా చూడసాగాడు.

మాధవరావు నవ్వి దుర్గతో ''తప్పకుండా... అడిగే హక్కు యీ ప్రజాస్వామ్యంలో అందరికీ వుంది.'' అన్నాడు.

వెంటనే మరోసారి సూటిగా అడిగింది 'ఏం చూసి యితనికి ఓటెయ్యమంటారు సార్?''

ఉలిక్కి పడ్డాడు మాధవరావు. చూస్తున్న జనాల్లో కూడా అలజడి మొదలయ్యింది. అతి

పేదగా, సామాన్యంగా కనబడే ఓ స్త్రీ తనని అందరిలో పట్టుకుని ప్రశ్నించేసరికి కొంచెం తడబడ్డాడు. కాని వెంటనే సర్దుకున్నాడు.

సింహాద్రి అవమానంతో రగిలిపోయాడు ''నిన్ను... నిన్ను... '' జనం వున్నారనే విషయం మర్చిపోయి బూతు మాట ప్రయోగించబోయాడు.

మాధవరావు అతన్ని గట్టిగా మందిలిస్తూ ''అందరూ మనల్నే చూస్తున్నారు'' అన్నాడు.

సింహాద్రి చప్పున నోరు మూసేశాడు.

మాధవరావుకి కూడా బాగా ఆవేశం వచ్చింది. ఈ లోపు అక్కడున్న జనాభా యింకా రెట్టింపయ్యారు.

చాలా బలవంతంగా తనని నిగ్రహించుకుని, ముఖం మీద మందహాసం తెచ్చుకుని ''ఏం చూసి అంటావేమిటి? అతను నీ భర్తమ్మా.''

ఆ మాట వినగానే హూంకరించింది దుర్గ ''భర్త..... హూ... అతను నా భర్తని యిప్పుడు మీరంటున్నారు గాని, ఒక్కరోజు... కనీసం ఒక్క రోజు కూడా భర్తగా, పిల్లలకి తండ్రిలా ప్రవర్తించలేదతను.''

తలకొట్టేసినట్టయింది సింహాద్రికి. చేసేదేమిలేక చూస్తూ వుండిపోయాడు.

మాధవరావు మాత్రం తెచ్చి పెట్టుకున్న అదే శాంతంతో ''తప్పమ్మా... అలా అనకూడదు. ముందు లోపలికి వెళ్ళి మాట్లాడుకుందాం పద.'' అన్నాడు.

''ఫర్వాలేదు. ఇక్కడే చెప్పండి. ఈయనగారిప్పుడు ప్రజల మనిషి కదా?'' వ్యంగ్యంగా అంది.

పోగయిన జనం మాధవరావు ఏం చెబుతాడా అని ఆసక్తిగా ఎదురు చూడసాగారు.

సన్నివేశం యిలా ఎదురు తిరుగుతుందనుకోలేదు అతను. ఇక తప్పదన్నట్టు సింహాద్రి తరుపున వకాల్తా పుచ్చుకుని అన్నాడు ''వాడిప్పుడు చాలా మారాడమ్మా. మొన్నటి సింహాద్రి కాదు. పార్టీ కోసం ఎంత పోరాడాడో నీకు తెలుసుగా? చివరకు ప్రాణాలు కూడా త్యాగం చెయ్య బోయాడు...''

''ఈ నాలుగు రోజులకోసం మారతాడు. అయినా అతను మారాడని ఎలా చెప్పగలరయ్యా మీరు? ఏడేళ్ళనుంచి కాపురం చేస్తున్న నేను చెప్పాలి. పెళ్ళయిన దగ్గర్నుంచి ఎన్నోసార్లు మారు.... మారు... మారు.. అని గొంతు పగిలేలా, కడుపులో ప్రేగులు తెగేలా ఏడుస్తూనే వున్నా. అయినా అతనిలో మార్పులేదు. నెలలో కనీసం ఒక రోజయినా యింట్లో వుండడు. ఎప్పుడూ ఏదో దొమ్మి కేసుల్లోనో, గొడవల్లోనో బాధ్యత లేకుండా తిరుగుతూనే వుంటాడు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బ్రతుకుతున్నాం.

ఎప్పుడో వస్తాడు. నాకోసం, పిల్లల కోసం కాదు. అతని సుఖం కోసం. అప్పుడూ యీ ఎముకలతో వున్న శరీరం కావాలి. అవసరం అయిన తర్వాత మళ్ళీ మామూలే.''

మ్రాన్పడిపోయి చూస్తున్నారందరూ.

''ఏమన్నారు సార్...? నిరాహారదీక్షలూ చేశాడా? అతన్ని పెళ్ళి చేసుకున్నప్పట్నుండి అతని ప్రవర్తనతో విసిగి పోయి సరియైన తిండి లేక, పస్తులు వుండి మనసు చచ్చిపోయి నేను కూడా యిప్పటికీ నిరాహారదీక్ష చేస్తూనే వున్నాను. మరి నన్నెవరు గుర్తించారు? నిరాహార దీక్ష విరమించడానికి ఎవరో ఒకరు వచ్చి నిమ్మరసం తాగిస్తారు. నాదీక్ష భగ్నం చెయ్యడానికి ఎవరొచ్చారు? ఎవరు తాగిస్తారు?

నేను కూడా పోతే పిల్లలు దిక్కులేని వాళ్ళవుతారని నాలో వున్న అహాన్ని, పౌరుషాన్ని చంపేసి రసంగా చేసుకుని, బ్రతకడానికి రెండు ముద్దలు తింటున్నాను. ఇది ఏ రోజయినా మొగుడిగా గుర్తించాడా?

అక్కడున్న వాళ్ళల్లో కొందరికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కడుపు దేవేసినట్లయింది.

ఎన్నో మీటింగుల్లో, ఎందరో తనమాటల చాతుర్యంతో ఆకర్షించే మాధవరావు కూడా చేష్టలు డిగినట్లు వుండిపోయాడు.

దుర్గ అంది ''ప్రాణత్యాగం చెయ్య బోయాడా? యితన్ని కట్టుకున్న పాపానికి నేను చేసుకోవాలి సార్. పెద్దాడికి స్కూల్ ఫీజు కట్టక పోతే పంపించేస్తానన్నారు. నా చిన్న కొడుకు జబ్బుచేసి ఆసుపత్రిలో వున్నాడు. ఏడ్చాను, మొత్తుకున్నాను. ఏమాత్రం కనికరం లేకుండా వాళ్ళకోసం అప్పుచేసిన డబ్బుతో తాగేసి పడిపోయాడు. అప్పుడు నాకొడుకులతో సహా చచ్చిపోదామనుకున్నాను.

ఫీజుకట్టలేదని వాడ్ని స్కూలునుంచి పంపేశారు. వైద్యం అందక నా చిన్న కొడుకు... నా చిన్నకొడుకు....'' కంఠం రుద్ధమై దుఃఖించసాగింది దుర్గ.

సూదిపడితే వినబడేంత నిశ్శబ్దం. దుర్గని ఎలా ఓదార్చాలో తోచక అలా చూస్తూ వుండిపోయారంతా.

సింహాద్రి తల వంగిపోయింది.

కాసేపాగి దుర్గ తేరుకుని అంది ''మీరంతా పెద్ద పెద్దవాళ్ళు. ఈ ప్రపంచంలో ఎలా బ్రతకాలో తెలసినవాళ్ళు. నాలాంటి ఆడదానికి మాత్రం తెలీదు. గుండెలమీద భారం దింపుకోవడానికి ఆలోచన లేక తొందరపడి పెళ్ళిచేశారు. అమాయకంగా నా సర్వస్వం నా భర్తే అనుకున్నాను. కాని, అతని సర్వస్వం మీరు. మీరు పోయించే మందు, ఒక బిర్యాని పొట్లాం.

ఏ ఆడదయినా రెండు పూటలా అన్నం పెట్టలేని మొగుడ్నయినా క్షమిస్తుందిగాని, భార్యని ఒక మనిషిలా చూడలేని, బాధ్యత లేని వాడ్ని మాత్రం క్షమించలేదు. ఎలక్షన్లు వస్తాయి. ఇతను గెలుస్తాడు..... మీరే ఎలాగయినా గెలిపిస్తారు.... ఇప్పటి వరకు నా యింట్లోనే నరకం చూశాను... ఇలాంటి వాడు నాయకుడయితే యీ పేట మొత్తం నరకం చూస్తుంది. నా జీవితం ఎలాగో కాలిపోయింది. ఇతన్ని నిలబెట్టి మీరు సమాజాన్ని కాలుస్తున్నారు. అది నా కిష్టంలేదు. అందుకే నా బాధ్యతగా యితనికి ఓటు వెయ్యను.''

నెత్తురు చుక్కలేదు ఎవరి ముఖాల్లో కూడా.

''ఒక కుటుంబాన్ని ఎలా యీదాలో తెలియని ఇతను కాబోయే నాయకుడా?.... దానికి మీలాంటి పెద్దమనుష్యులు అండ... హూ....'' చీదరింపుగా అనేసి లోపలికెళ్ళి తలుపేసుకుంది దుర్గ.

తెల్లబోయి శిలా విగ్రహాల్లా నిలబడిపోయారంతా.

దుర్గ మాటల్లోని నిజం ప్రచండ భాస్కరుడై ఒక్కసారిగా ప్రకాశించి, అహంతో కప్పేసిన తప్పుల్ని వెలికి తీస్తున్నట్టుగా అయ్యింది.

ఎంతటి వారైనా నిజం ముందు తలవంచి తీరాల్సిందే. అది నిలదీసినప్పుడు అపరాధభావంతో గడగడా వణికిపోవాల్సిందే. జీవితంలో మొట్టమొదటిసారిగా వణికిపోయాడు మాధవరావు. తన తప్పును సరిదిద్దుకునే ఆలోచన చెయ్యసాగాడు.

*

రచయిత సెల్ నెం: **9392104204**



కవిత

## స్మృతులు బింబాలై

కొన్ని స్మృతులు ఒంటినిండా పులకాంకురాలను
మొలిపిస్తాయి.
మరికొన్ని స్మృతులేమో మనసునిండా
ప్రతీకారవాంఛలను పడగెత్తిస్తాయి.
స్మృతులకు స్వతహాగా రూపం లేదు.
కానీ తాము ముద్రించుకున్న రూపాలతోనే అవి
ఆవిష్కృతమవుతుంటాయి.
గతం స్మృతిగా మిగులుతుంది.
వర్తమానం ప్రత్యక్షాకృతిగా కదులుతుంది.
భిన్నభిన్న స్మృతులు కొన్నిసార్లు
పరస్పరం ఢీకొంటాయి.
ఒక్కొక్క స్మృతి
తన ప్రాధాన్యాన్ని బహిర్గతం చేయడానికి
అనుక్షణం కాలు దువ్వుతుంటుంది.
ఆయా స్మృతుల నిరంతర ఘర్షణతో
గుండె నిట్టూర్పుల కుంపటి అవుతుంది.
సుఖమయంగా సాగిపోయే జీవితం
వికలమైపోతుంది.
ఎన్నో స్మృతులు విస్మృతులైపోయినా
కొన్ని నిత్యమననీయంగా మిగిలిపోతాయి.
అవి మొదట రేఖలు రేఖలుగా స్ఫురిస్తూ
క్రమక్రమంగా సమగ్ర బింబాలై
కళ్ల ఎదుట నిలుస్తాయి
ఎవరికైనా ఆ కొన్ని స్మృతులు చాలు
సమకాలిక జీవనగతులకు
పథ నిర్దేశం చేయడానికి
కటిక చేదు స్మృతులను మనసు అద్దం పైనుంచి
తుడిచేసుకుంటూ
మధురిమలను పంచే స్మృతులను
ప్రతిబింబించుకుంటూ
ప్రస్థానించడమే
మన లక్ష్యం కావాలని కోరుకుందాం

**-డా. సి.నారాయణరెడ్డి**

